## భువనేశ్వర్ ఐఐటీ ..

# జాతికి అంకితం

- డైరెక్టర్ ఆర్.వి.రాజ్‌కుమార్

**భువనేశ్వర్:**

స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ)ను జాతికి అంకితం చేయనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.వి.రాజకుమార్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సంస్థను జాతికి అంకితం చేయడంతో దీని ప్రతిష్ట రెట్టింపవుతుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 24న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్థానిక ఐఐటీని జాతికి అంకితం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కార్యక్రమం ఖరారైందని తెలిపారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రాంగణంలో భారీ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటవుతుందని చెప్పారు. ఐఐటీని జాతికి అంకితం చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విచ్చేస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.వి.రాజ కుమార్ వివరించారు. భారత ప్రభుత్వం 2008వ సంవత్సరంలో ఆవిష్కరించిన ఐఐటీ వర్గంలో స్థానిక ఐఐటీ ఉన్నతమైనదిగా కొనసాగడం ఈ ప్రతిష్టాత్మకతకు నోచుకున్నట్లు భావిస్తున్నారు. ఈ సంస్థ ఉజ్వల భవిష్యత్తులో ఇదో మైలు రాయిగా నిలుస్తుందని విలేకరులకు వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్థానిక ఐఐటీ సందర్శనను పురస్కరించుకుని క్యాంపస్ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.




**విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ, ఐజర్ డైరెక్టర్లు**

### బరంపురం ఐజర్‌కు శంకుస్థాపన

భారతీయ విజ్ఞాన విద్య పరిశోధన సంస్థ (ఐజర్) సొంత భవనం పనులకు శ్రీకారం చుడుతోంది. బరంపురంలో ఈ సంస్థ సొంత భవనం నిర్మితమవుతోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బరంపురం ఐజర్ సొంత భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఆ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసరు కె.వి.ఆర్.చారి తెలిపారు. స్థానిక ఐఐటీ క్యాంపస్ ప్రాంగణంలో నిర్వహించిన ఐఐటీ–ఐజర్ ఉమ్మడి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఐఐటీ ప్రాంగణం నుంచి రిమోట్ వ్యవస్థతో బరంపురంలో నిర్మించనున్న ఐజర్ సొంత భవనం నిర్మాణానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేసే కార్యక్రమం ఖరారైనట్లు వివరించారు. బరంపురం శివారులో సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని లౌడిగాంవ్ ప్రాంతంలో ఐజర్ సొంత భవనం నిర్మితం కానుంది. దేశంలో పలు చోట్ల భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 7 భారతీయ విజ్ఞాన విద్య పరిశోధన సంస్థల్లో బరంపురం ఐజర్ ఇటీవల కార్యాచరణ ప్రారంభించింది. గంజాం జిల్లా బరంపురం పరిసరాలు లౌడిగాంవ్ ప్రాంతం 200 ఎకరాల విస్తీర్ణపు స్థలంలో సొంత భవనం నిర్మాణమవుతుంది. బరంపురం ఐజర్ సొంత భవనం నిర్మాణ వ్యయ ప్రణాళిక రూ.1,582.78 కోట్లుగా డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.ఆర్.చారి తెలిపారు. ఈ భవన నిర్మాణం 2021వ సంవత్సరం డిసెంబరు నెల నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో శంకుస్థాపన కార్యక్రమం ఖరారు చేసినట్లు ఆయన వివరించారు. వందలాది మంది వైజ్ఞానిక మేధావుల్ని ఆవిష్కరించేందుకు బరంపురం ఐజర్ సంస్థ నాభి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ప్రేరేపిస్తుంది. 21వ శతాబ్దపు ప్రపంచ వ్యాప్త వైజ్ఞానిక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు వీలుగా యువతరంలో వైజ్ఞానికతకు ఈ సంస్థ ఆవిష్కరిస్తుందని ఆయన తెలిపారు.

సాక్షి
Fri, 21 December 2018
https://epaper.sakshi.com/c/35052122